కీసర ఆర్డీవోగా సైదులు

కీసర, అక్టోబర్ 28: కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త ఆర్డీవోగా పి. సైదులును ప్రభుత్వం నియమిస్తూ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డిని సిరిసిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మేడ్చల్ జిల్లా ఎస్‌డీసీ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న పి.సైదులును కీసర ఆర్డీవోగా బదిలీ చేశారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్

ఘట్‌కేసర్,అక్టోబర్ 28: ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన మీర్‌పేట్‌లో పని చేసి ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎండీ సాబేర్ అలీ నిజాంపేట్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్మన్ పావని తోపాటు, కౌన్సిలర్లు, సిబ్బంది నూతన కమిషనర్ చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్,అక్టోబర్ 28 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. 71 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా వినతులపై సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్‌లో మార్కండేయ దేవాలయ ముఖద్వార శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్, అక్టోబర్ 28: డివిజన్‌లోని డీమార్టు వద్ద మార్కండేయ దేవాలయ ముఖద్వారానికి సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, భూమిపూజ చేశారు. సంఘం ప్రతినిధులు స్వామి ముఖద్వారాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణీవెంకట్‌రావు,బీఆర్‌ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి,గిరిబాబు, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ,సంఘం ప్రతినిధులు రాంనర్సయ్య, మురళి, ఛైర్మన్ వెంకటయ్య, రఘు,భిక్షమయ్య, పెంటయ్య, రమేశ్, శేఖర్, వీరేశం, కృష్ణమూర్తి, కృష్ణ, వివిధ పార్టీల నాయకులు నారాయణదాసు, తౌఫిక్, ఉపేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సుధాకర్,శ్రీకాంత్‌యాదవ్,సత్యనారాయణ, రాణి, సందీప్, నామ్‌రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఉప్పల్ : నాచారం ఇందిరానగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి తనవంతుగా తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్, పలువురు నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

పేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- సీపీఎం కాప్రా సర్కిల్ మహాసభలో పలువురు నాయకులు

మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఎం నాయకులు

కాప్రా, అక్టోబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని, కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం కాప్రా సర్కిల్ కమిటీ మూడో మహాసభ డిమాండ్ చేసింది. సోమవారం చర్లపల్లి వివేకానంద కాలనీలో కామ్రెడ్ ఏచూరి సీతారామ్‌నగర్‌లో సీపీఎం మహాసభలో పార్టీ సీనియర్ నాయకులు జి.యాదగిరిరావు, నర్సింగరావు, ఎస్.వీరయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులు, పేదల సంక్షేమం కోసం, విద్యార్థి సమస్యలపై పోరాడాలనీ, బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ విస్తరిస్తున్నందున ఐదు ఫేజ్‌లను కలుపుతూ కార్మికులకు బస్ సౌకర్యం కల్పించాలని, మెట్రోరైలు సౌకర్యం హబ్సిగూడ,నాచారం, చర్లపల్లి,ఈసీఐఎల్ మీదుగా జూబ్లీ బస్‌స్టేషన్ వరకు పొడిగించాలని తీర్మానాలు చేశారు. అనంతరం సీపీఎం కాప్రాసర్కిల్ నూతన కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. సర్కిల్ నూతన కార్యదర్శులుగా సీహెచ్‌వీ ప్రసాద్, రాఘవరావు, వెంకటాచారి, గణేశ్, కొండల్‌రెడ్డి, దుర్గయ్య, సత్యనారాయణ, వెంకటే, సఫియా సుల్తానా, శివన్నారాయణ, ఎండీ జెన్నీలను ఎన్నుకున్నారు.

శ్మశానవాటిక పరిసరాల్లో డబ్బాలను తొలగించాలి

మేడ్చల్, అక్టోబర్ 28 : పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ముస్లిం శ్మశాన వాటిక పరిసరాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని కోరుతూ పలువురు ముస్లింలు సోమవారం కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటిక ప్రధాన మార్కెట్‌కు సమీపంలో ఉన్నందున కొందరు రాత్రికి రాత్రి డబ్బాలు వేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆక్రమణను తొలగించాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

గుర్తింపు కార్డులతో విస్తృత ప్రయోజనాలు

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

బహుళ ప్రయోజన ఐడీ కార్డులను విద్యార్థులకు అందజేసిన మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, ఐసీఐసీఐ బ్యాంకు అధికారులు

మేడ్చల్, అక్టోబర్ 28 : బహుళ ప్రయోజన గుర్తింపు కార్డులతో విద్యార్థులు అనేక రకాల సేవలను పొందవచ్చునని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులకు ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో రూపొందించిన చిప్ గుర్తింపు కార్డులను సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో సాంకేతిక మార్పులు వచ్చాయన్నారు. ఈ గుర్తింపు కార్డులతో విశ్వవిద్యాలయం, గ్రంథాలయం, హాస్టల్‌లో విద్యార్థులు ఎక్కడ ఉన్నా ఆటోమెటిక్‌గా నమోదవుతుందన్నారు.

వైస్ చాన్స్‌లర్ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. గుర్తింపు కార్డు బహుళ ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. ఈ కార్డును డెబిట్‌కార్డుగా ఉపయోగించి రూ.5 లక్షల వరకు నగదు లావాదేవీలు జరుపవచ్చన్నారు. ట్యూషన్, పరీక్షా ఫీజు వంటి వాటిని ఈ కార్డు ద్వారా చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ భద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఆంజనేయులు, హెచ్‌వోడీ డాక్టర్ సుజిత్, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ధనుంజనాచారి, ఐసీఐసీఐ బ్యాంకు అధికారులు రాహుల్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్ కమిషనర్‌గా భాస్కర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 28 : నాగారం మున్సిపల్ కమిషనర్‌గా భాస్కర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలికారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, కౌన్సిలర్ హరిబాబు, మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ సుదర్శన రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్తతో గొడవ.. ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

అదృశ్యమైన తల్లి రజిత, పిల్లలు రితిక, విఘ్నేశ్వర్(ఫైల్)

జవహర్‌నగర్, అక్టోబర్ 28: భర్తతో గొడవ కారణంగా మనస్తాపం చెందిన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో జరిగింది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని శ్రీలక్ష్మికాలనీలో భూక్యా వెంకన్న తన భార్య రజిత, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. వెంకన్న స్థానికంగా కూలీ పనులు చేసేవాడు. ప్రేమ వివాహం చేసుకున్న వెంకన్న దంపతులు అన్యోన్యంగా ఉండేవారు. పెద్ద కుమార్తె కొత్తగూడెంలో చదువుతున్నది. అయితే కొంతకాలంగా వెంకన్న, భార్య రజితకు చిన్నపాటి గొడవ జరుగుతున్నది. ఈ నెల 28న రాత్రి భోజనం చేసిన వెంకన్న నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి లేచి చూడగా భార్య రజిత (30), పిల్లలు రితిక(4), విఘ్నేశ్వర్(3) కనిపించలేదు. ఆచూకీ కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినప్పటికీ సమాచారం లభించలేదు. ఆందోళన చెందిన భర్త వెంకన్న పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాకథాన్ విజేతలకు బహుమతులు



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న నర్సింహారెడ్డి కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం తదితరులు

మేడ్చల్, అక్టోబర్ 28 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 36 గంటల పాటు 'కోడ్ స్టార్మ్' పేరుతో నిర్వహించిన హ్యాకథాన్ సోమవారం ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో 5 రాష్ట్రాల్లోని 45 కళాశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీఎన్‌ఆర్ వీజేఐటీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఐఐటీ మద్రాస్, హైదరాబాద్ కేఎల్ విశ్వ విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. నర్సింహారెడ్డి, సీఎంఆర్ కళాశాలల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. కాగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ. 50 వేల నగదు బహుమతి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 30, రూ. 20 వేల నగదు బహుమతి, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, సీఎస్‌ఈ హెచ్‌వోడీ డాక్టర్ రాము, డాక్టర్ దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కూచిపూడి కళను కాపాడుకోవాలి

కూచిపూడి నృత్యోత్సవంలో కళాకారులతో రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 28: ప్రాచీన కూచిపూడి కళను కాపాడుకోవాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ సర్కిల్ వేణుగోపాల్‌నగర్‌లో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్య మయూరి కళానికేతన్ కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, డిప్యూటీ డైరెక్టర్ రఘునాథన్, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, జయంతి నారాయణ, చెంచులక్ష్మి, సరస్వతిదేవి, నరసింహమూర్తి, నీరజాదేవి, డాక్టర్ వీవీఎన్ చలపతిరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో రూ.5.4 కోట్లతో అభివృద్ధి పనులు

సమావేశమైన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 28 : దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో రూ.5.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభ్యులు తీర్మానం చేశారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ ప్రణీతాశ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 18 వార్డుల్లో వార్డుకు రూ.30 లక్షల చొప్పున రూ.5.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా నీటి సరఫరా మోటర్ల మరమ్మతులకు సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు, మున్సిపాలిటీలో విలీనమైన ఆరు పంచాయతీల్లో నీటి సరఫరాకు రూ.17 లక్షలు, హరితహారం మొక్కల సంరక్షణ, నర్సరీ నిర్వహణకు రూ.5 లక్షలు కేటాయించాలని నిర్ణయించారు. కాగా రోడ్డు వెడల్పుతో మున్సిపాలిటీ కార్యాలయాన్ని తొలగించనున్న కారణంగా మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.2.5 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించాలని తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, అధికారులు, కౌన్సిలర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

జవహర్‌నగర్, అక్టోబర్ 28: వాహనదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే జప్తు చేస్తామని, శాంతిభద్రతలలో రాజీపడే ప్రసక్తే లేదని జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సైదయ్య హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ చెన్నాపురం చౌరస్తాలో ఎస్‌హెచ్‌వో సైదయ్య ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడుపవద్ద, బైక్‌లపై ముగ్గురు ప్రయాణించరాదన్నారు. ఎస్సై రామునాయక్, జవహర్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు.

నాచారం ఓల్డ్ విలేజ్‌లో త్వరలోనే రోడ్డు పనులు

నాచారం కార్పొరేటర్‌శాంతి సాయిజెన్‌శేఖర్‌ను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

రామంతాపూర్,అక్టోబర్ 28 : నాచారం ఓల్డ్ విలేజ్‌లో త్వరలోనే సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ స్పష్టంచేశారు. నాచారం రోడ్డుకు 54 లక్షల నిధులు మంజూరు చేయించడంపై గ్రామ పెద్దలు భూపాల్‌రెడ్డి, సాయిబాబా, యాదగిరిగౌడ్ తదితరులు కార్పొరేటర్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. నాచారం ఓల్డ్ విలేజ్‌లో భూగర్భ డ్రైనేజీ లేక పోవడంతో సిమెంట్ రోడ్డు పనులు ఆలస్యమయ్యాయన్నారు. సుమారు కోటి రూపాయలతో నాచారం ఓల్డ్ విలేజీలో భూగర్భడ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. స్థానికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి

ఘట్‌కేసర్,అక్టోబర్ 28 : ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి స్నేహితుల వద్ద అప్పులు చేసిన బీటెక్ విద్యార్థి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్(22)బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. స్నేహితులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి వాటిని కట్టలేక ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ దవఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాపు జరుపుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తా : కార్పొరేటర్

మల్కాజిగిరి, అక్టోబర్ 28: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం నెహ్రూనగర్‌లో రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా అధికారులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, సుధాకర్, ఎల్లం, అంజనేయులు, నరసింహాచారి, కృష్ణ, దినేశ్, సాధన, శ్రీనివాస్‌యాదవ్, నటరాజ్ పాల్గొన్నారు.

అయ్యప్ప దీవెనలు అందరికి ఉంటాయి..



మల్కాజిగిరి, అక్టోబర్ 28: అయ్యప్ప స్వామి దీవెనలు అందరికీ ఉంటాయని ఎంబీసీ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం మల్కాజిగిరిలో రెబ్బవాసు ఆధ్వర్యంలో మాలధారులు ఇరుముడితో శబరిమలై యాత్రకు బయల్దేరుతూ నిర్వహించిన పూజలో ఎంబీసీ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు.

ఐఏఎస్‌లు సమాజంలో 'గేమ్‌ఛేంజర్స్'

- రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ వివేకానంద

సదస్సులో మాట్లాడుతున్న రక్షణ మంత్రిత్వశాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద

మేడ్చల్, అక్టోబరు 28 : ఐఏఎస్‌లు సమాజ గేమ్‌ఛేంజర్స్ అని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్, రక్షణ మంత్రిత్వ శాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లో సోమవారం 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ' ఆధ్వర్యంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలపై 'సివిల్ సర్వీసెస్–గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ కెరీర్ ఫర్ ఏ ఫ్రెష్ గ్రాడ్యుయేట్' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సర్వీసెస్‌ను సాధించడమంటే ఉద్యోగ భద్రత, వ్యక్తిగత ప్రయోజనమే కాకుండా సమాజంలో మార్పు తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. పేదరికం, విద్య, ప్రజారోగ్యం వంటి సామాజిక సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. సరియైన ప్రణాళికతో ముందుకెళ్తే రెండేళ్లలోనే యూపీఎస్సీని సాధించవచ్చన్నారు. సొంతంగా ఆలోచించే శక్తి, సామర్థ్యాలను పెంచుకుంటే ఐఏఎస్ సాధించడం కష్టమేమీ కాదన్నారు. అనంతరం డాక్టర్ వివేకానంద విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

అకాడమీ డైరెక్టర్ రమణ ముప్పాల మాట్లాడుతూ.. యూపీఎస్సీ దేశంలో అత్యున్నత స్థాయి పోటీ పరీక్ష అని, ప్రతి ఏడాది యూపీఎస్సీ ద్వారా 21 పౌర సేవలకు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ మేజర్ డాక్టర్ నారాయణ తెలంగాణ పబ్లికేషన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ రవికుమార్, తెలంగాణ పబ్లికేషన్స్ మేనేజర్ గణేశ్, అసిస్టెంట్ మేనేజర్ కేఆర్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ పీఎస్‌లో రక్తదాన శిబిరం



నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో రక్తపరీక్షను ప్రారంభించిన మల్కాజిగిరి డీసీపీ పీవీ పద్మజ

నేరేడ్‌మెట్, అక్టోబర్ 28: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మల్కాజిగిరి డీసీపీ పీవీ పద్మజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. హెల్త్ ఈజ్ వెల్త్ అన్నారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ విధి నిర్వాహణలో ఉండటంతో ఆరోగ్య సంరక్షణకు టైమ్ ఉండదని, శ్రద్ధ తీసుకుని వ్యాయామం, యోగా వంటివి చేయాలన్నారు. అనంతరం రక్తదానం చేసినవారికి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ మహేశ్‌కుమార్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్, లయన్స్ సురేశ్‌కుమార్, లయన్స్ జ్యోతిర్మయి చారి, డెంటల్ డాక్టర్ హేమంత్, సన్‌సీడ్ హస్పిటల్ డాక్టర్ అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో నయంచేయొచ్చు

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు

మేడ్చల్, అక్టోబర్ 28 : ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చునని అపోలో హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ ఆశీశ్ చౌహాన్, డాక్టర్ సౌమ్య కోరుకొండ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ విద్యాసంస్థల ఆడిటోరియంలో సోమవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమ ం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తిస్తే సరియైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్ బారిన పడిన వారు బలమైన ఆహారం తీసుకుంటూ నిత్య వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మోక్ష ప్రసూన, సీఎంఆర్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీపీ నారాయణ, డీన్ డాక్టర్ రవికుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గబ్బిలాల్‌పేట దశ తిరిగేలా అభివృద్ధి పనులు



డ్రైనేజీ పనులను ప్రారంభించిన మేయర్ శాంతి

జవహర్‌నగర్, అక్టోబర్ 28: గతంలో గబ్బిలాల్‌పేటలో సమస్యలు విలయ తాండవం చేసేవని.. నేడు అందమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలతో అభివృద్ధి చెందుతుందని మేయర్ శాంతి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ గబ్బిలాల్‌పేటలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10 లక్షలతో సోమవారం భూగర్భ డ్రైనేజీ పనులను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనులతో జవహర్‌నగర్ స్థితిగతులు మారనున్నాయని, 100 ఫీట్ల రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, కొమురయ్య, శ్రీను, రాజు, గణేశ్, వినోద్, సాయి, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉప్పల్, అక్టోబర్ 28 : బీరప్పగడ్డ వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చైల్డ్ సురక్ష ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు డెంటల్, కంటి, జనరల్ పరీక్షలు నిర్వహించారు. ఫౌండేషన్ డైరెక్టర్ మేధ సందీప్, సంజయ్, రాంచందర్, శశి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాగరాజు, అధ్యక్షుడు శివకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శంకర్‌సింగ్

మేడ్చల్, అక్టోబర్ 28 : మేడ్చల్‌కు చెందిన జిమ్ కోచ్ శంకర్‌సింగ్ ఉత్తమ ఫిట్‌నెస్ సాధించిజాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మేడ్చల్ పట్టణ పరిధిలో ఎక్స్‌ట్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ శంకర్‌సింగ్ సీనియర్ మాస్టర్స్‌క్లాసిక్‌లో కండరాల మానియా మాస్టర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. దీంతో అతడికి డిసెంబర్‌లో బెంగుళూరులో జరిగే ప్రతిష్ఠాత్మక ప్రోషోలో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పట్టణంలో ఫిట్‌నెస్ శిక్షకులు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి శంకర్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కీసరగుట్టలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

కీసర, అక్టోబర్ 28; కీసరగుట్టలో రాజరాజేశ్వర స్వామివారికి సోమవారం వేదపండితులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో శివ భక్తులు అధిక సంఖ్యలో కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే గర్భాలయంలో మూలవిరాట్‌కు తేనే, ఆవు పాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

ఉప్పల్ కురుమ సంఘం యువత కమిటీ

రామంతాపూర్, అక్టోబర్ 28 : ఉప్పల్ కురుమ సంఘం యువత కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యంగారి రాకేశ్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బట్కిరి కుమార్,ఉపాధ్యక్షులుగా గొరిగె శివాజీ, గోదె శివ, ప్రధాన కార్యదర్శిగా సోమ బాలకృష్ణ, కోశాధికారిగా కొల్లు రవితేజ,సంయుక్త కార్యదర్శిగా మరాటి శీను, సహాయక కార్యదర్శులుగా ఎర్ర వెంకటేశ్, బర్ల బాలరాజు, సలహాదారులుగా గొరిగె ఐలేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిందం వెంకటేశ్, బర్ల కృష్ణ, హనుమంత్, ఎర్ర శ్రీనివాస్,శాగ పెంటయ్య, రాష్ట్ర కురమ సంఘం కార్యదర్శి గొరిగె మల్లేశ్, రమేశ్, రఘు, ఐలయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.